క్లుప్తంగా

నేడు మండల కేంద్రంలో వైద్యశిబిరం

రెబ్బెన: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద శనివారం ఉదయం 8 గంటల నుంచి కరీంనగర్‌కు చెందిన సన్‌షైన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ అహల్యాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో షుగర్, బీపీతో పాటు ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలోని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న మాలీ సంఘం నేతలు

కెరమెరి: తెలంగాణ ప్రగతిభవన్‌ను పూలే భవన్‌గా మార్చిన సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి మాలీ సంఘం నాయకులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ మాలీలకు విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు కావ్డే తుల్సిరాం, నాయకులు శ్యాంరావు, సెండే నారాయణ, కొట్రంగే తిరుపతి, సెండే సకారాం, శ్యాంరావు, వాడాయి సోమ, ఎల్.చందు, పోశెట్టి, రావుజి, తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ సంతాజీ మహరాజ్ జయంతి



నివాళులర్పిస్తున్న ఆత్రం సక్కు

ఆసిఫాబాద్అర్బన్: శ్రీ సంత్ శిరోమణి శ్రీ సంతాజీ జగన్నాడే మహరాజ్ జయంతిని శుక్రవారం జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో కాలనీవాసులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు హాజరై శ్రీ సంతాజీ జగన్నాడే మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లిఖార్జున్, గాండ్ల తేలికుల సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షుడు సందీప్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలువేరు వెంకన్న, తుకారాం, బాబురావ్, శంకర్‌పటేల్, గోపాల్‌నాయక్, మురళి, ప్రణయ్, రవీందర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపవాసం విరమణ

లింగాపూర్: శాసనసభ ఎన్నికల్లో కోవ లక్ష్మి ఎమ్మెల్యేగా గెలుపొందాలని 13 రోజులుగా ఉపవాసం ఉంటున్న మండలంలోని ఎల్లాపట్టార్ గ్రామానికి చెందిన సలాం మారు శుక్రవారం ఉపవాసం విరమించారు. సలాం మారు ఉపవాసం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి గ్రామానికి వెళ్లి ఉపవాసం విరమింపజేశారు.

'నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి'

ఎదులాపురం: వాతావరణ ప్రభావం, అకాల వర్షాలు, తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్‌సింగ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. జిల్లాలో వరి, పత్తి, కంది (తొగరి) పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, వేల ఎకరాలలో పంటలు కోత దశలో నీట మునిగియన్నారు. ఆరబోసిన ధాన్యం తడిసి మొలకెత్తిందని, పత్తి పంట రంగుమారి పనికిరాకుండా పోయిందన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాన్ని మండల కేంద్రంలోని ప్రధాన వీధులు గుండా ఊరేగించారు. ఊరేగింపు అనంతరం విగ్రహాన్ని కుప్టి వద్ద కడెం నదిలో చక్రస్నానం చేయించారు.

ఎమ్మెల్యే వినోద్‌ను కలిసిన ఎస్సీ, ఎస్టీ నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన అఖిల భారత ఎస్సీ, ఎస్టీ సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు అడ్డూరి వెంకటస్వామి, రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌రాజ్‌తో కలిసి కొత్తగా ఎన్నికైన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని స్వగృహంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇష్టారాజ్యంగా నీటి సరఫరా!

- ఎప్పుడు నీరు వస్తుందో తెలియని పరిస్థితి
- కొన్నిప్రాంతాల్లో పూర్తిగా సరఫరా కాని వైనం
- తిప్పలు పడుతున్న జిల్లాకేంద్రం వాసులు



డ్రైయినేజీ నుంచి వేసిన మిషన్ భగీరథ పైపులైన్

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని పలు కాలనీలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. ప్రతీ ఇంటికి తాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో గతేడాది ఇంటింటికీ పైపులైన్‌లు ఏర్పాటు చేశారు. కానీ సంబంధిత అధికారులు మాత్రం నీటి సరఫరాలో జాప్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నీటి సరఫరా కోసం అధికారులకు విన్నవించగా తమ పరిధిలో లేదంటూ దాటవేసే ధోరణి అవలంభిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కాగా పైపులైన్‌లు వేసేందుకు తవ్విన గుంతలు సక్రమంగా పూడ్చకపోవడంతో రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి.

ఇష్టారాజ్యంగా పైపులైన్‌ల ఏర్పాటు..

పట్టణంలో మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌లు ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్ పర్యవేక్షణ లోపంతో వాటిని మురికి కాలువల నుంచి ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డుపై వెళ్లే వారి కాళ్లకు తగిలేలా నల్లాలకు కనెక్షన్‌లు ఇవ్వడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో వాటికి తగిలి ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో నీటిని అందించే పైపులైన్‌ల ద్వారా సక్రమంగా నీటి సరఫరా జరిగేదని, కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి వేసిన కొత్త పైప్‌లైన్‌లు అలంకార ప్రాయంగా మిగిలాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామసభలో అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా మంచినీటి సరఫరా చేయడం లేదని పలు కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కేంద్రంలో క్రమం తప్పకుండా నీటి సరఫరా చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పర్యవేక్షణ కరువైంది..



మిషన్ భగీరథ నీటి సరఫరాపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువైంది. ఏ రోజు నీరు సరఫరా అవుతుందో తెలియని పరిస్థితి ఉంది. కొత్త ప్రభుత్వంలోనైనా క్రమం తప్పకుండా నీరు సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పిన్నా మహేశ్, స్థానికుడు

ఇష్టారాజ్యంగా పైపులైన్లు ఏర్పాటు..



మిషన్ భగీరథ పైపులైన్‌లను భూమి లోపలి నుంచి వేయాల్సి ఉండగా రోడ్లపై కన్పించేలా వేశారు. దీంతో వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. పైపులైన్‌ల కోసం తవ్విన గుంతలు కూడా సరిగా పూడ్చలేదు. గత ఎనిమిది నెలలుగా నీటి చుక్క కూడా రావడం లేదు. నూతన పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేయాలి.

– ఒజ్జల శిరీష్, బ్రాహ్మణవాడ

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



నివేదిక చదువుతున్న విద్యుత్‌శాఖ ఏఈ ఇర్ఫాన్

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ చునార్కర్ సువర్ణ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. మండల వైస్‌ఎంపీపీ ఈర్త సత్యనారాయణ మాట్లాడుతూ మండల పరిషత్ స్థలంలో వ్యాపారసముదాయాలు నిర్మించాలని, 500 స్వచ్ఛ భారత్ టాయిలెట్స్ మంజూరు కోసం కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించాలన్నారు. మండలంలోని అచ్చెల్లి –చింతకుంట బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకం తొలగించి ప్రోటోకాల్ ప్రకారం నూతన శిలాఫలకం ఏర్పాటు చేయాలని సభా దృష్టికి తీసుకొచ్చారు. వేంపల్లి –పెద్దబండ వరకు రోడ్డుకిరువైపులా ఉన్న చెట్లను తొలగించాలని అటవీశాఖ అధికారులకు, ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచనలు చేశారు. సిర్పూర్(టి) –కాగజ్‌నగర్ ప్రధాన రహదారిని నూతనంగా నిర్మించాలని సభ్యులు కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో గైనకాలజిస్టు వైద్యుడు అందుబాటులో ఉండటం లేదని సభ్యులు ఆరోపించారు. అనంతరం మండలంలోని వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు సోహెల్ అహ్మద్, తుకారాం, మంగిలాల్, ఎల్ములే సరిత, ఎంపీడీవో రాజేశ్వర్, అటవీశాఖ రేంజ్ అధికారి పూర్ణచందర్, మండలంలోని సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ప్రజాప్రతినిధులు



స్వీట్లు తినిపిస్తున్న ప్రజాప్రతినిధులు

రెబ్బెన: ఆసిఫాబాద్ నూతన ఎమ్మెల్యేగా ఎన్నికైన కోవ లక్ష్మిని శుక్రవారం మండలానికి చెందిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా కోవ లక్ష్మిని శాలువాతో సన్మానించి స్వీట్లు తినిపించారు. అనంతరం మండలంలో నెలకొన్న సమస్యలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, వైస్ ఎంపీపీ గజ్జల సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, వైస్ చైర్మన్ రంగు మహేష్‌గౌడ్, సర్పంచ్ శ్యాంరావ్, ఉప సర్పంచ్ మడ్డి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు దుర్గం తిరుపతి, వెంకటేశం చారి, విలాస్, సురేష్‌జైస్వాల్ పాల్గొన్నారు.

జైనూర్: బీఆర్‌ఎస్ నాయకులకు, ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కోవ లక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే మలిదశ ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, ఎంపీపీ కుమ్ర తిరుమల విశ్వనాథ్, సహకార సంఘం చైర్మన్ కొడప హన్నుపటేల్, సీనియర్ నాయకులు మెస్రం అంబాజీ, జన్నావార్ పవన్, ముండే సతీష్ ఉన్నారు.

నార్నూర్: కార్యకర్తలు అధైర్య పడొద్దు అండగా ఉంటానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె స్వగృహంలో ఎంపీపీ కనక మోతుబాయి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆమెను కలిసి సన్మానించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తల సమిష్టి కృషితోనే భారీ మెజార్టీతో విజయం సాధించడం జరిగిందన్నారు. అధికారంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం లేదని ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. ఎలాంటి కష్టం వచ్చినా.. నేనున్నానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, సయ్యద్‌ఖాశీం, రాథోడ్ రమేశ్, రూప్‌దేవ్, పరమేశ్వర్, రాహుల్, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కౌటాల: సరుకులు అందజేస్తున్న నాయకులు



రెబ్బెన: ఆర్థికసాయం అందజేస్తున్న తోటి జవాన్లు

లింగాపూర్: మండల కేంద్రంలోని జాటోత్ రాహుల్ –సాయిప్రియల మూడేళ్ల కుమారుడు ధ్రువనాయక్ కొద్ది రోజుల క్రితం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించారు. గ్రంథాలయం చైర్మన్ కనక యాదవ్‌రావ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అనిల్ కుమార్, వైస్ ఎంపీపీ ఆడె ఆత్మారాం, సర్పంచ్ పద్మ నాను, సుమలత, జాదవ్ రమేశ్, సంగీతా బాయి, వినోద్ తదితరులు ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండలంలోని ముత్తంపేట్ గ్రామానికి చెందిన దుర్గం కేశవ్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి బీఎస్పీ నాయకులు శుక్రవారం ఆర్థికసాయం అందించారు. బీఎస్పీ సిర్పూర్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం వెంకటేశ్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. బాధిత కుటుంబానికి రూ.5వేల నగదు, 75 కిలోల బియ్యం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మోతిరాం, మల్లయ్య, ప్రవీణ్, శంకర్, సంతోష్, సురేష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలోని నంబాల గ్రామానికి చెందిన సీఐఎస్‌ఎఫ్ జవాను ఇంగు వెంకటేష్ వెస్ట్‌బెంగాల్‌లోని సీఐఎస్‌ఎఫ్ యూనిట్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి సీఏపీఎఫ్ జవాన్లు ఆర్థిక సాయం అందించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సీఏపీఎఫ్ జవాన్లు వాట్సప్ గ్రూప్ ద్వారా తోటి జవాన్లకు సమాచారం అందించి అందరి సహకారంతో రూ.15,500 ఆర్థిక సహాయాన్ని మృతి చెందిన వెంకటేష్ భార్యకు అందజేశారు. జవాన్లు జర్పుల నరేష్, గోగర్ల భీమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని అధికారులు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు పాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వం గాదిగూడను మండలంగా ఏర్పాటు చేసింది. అన్ని శాఖలకు అధికారులను నియమించింది. కానీ అధికారులు సమయపాలన పాటించక పోవడంతో ప్రజలు కార్యాలయాల వద్ద పడిగాపులు పడుతున్నారు. వివిధ శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. శుక్రవారం ఎంపీడీవో రామేశ్వర్‌తో పాటు సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ఖాళీ కుర్చీలతో కార్యాలయం వెలవెల బోయింది. వార్కాయి, ఖడ్కీ, అర్జుయాన్, హీరాపూర్ గ్రామాల నుంచి మహిళలు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు వేచి చూశారు. కార్యాలయం వద్ద నిరీక్షించారు. అయినా.. అధికారులు, సిబ్బంది రాకపోవడంతో నిరాశతో వెనుతిరిగారు.

ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

లక్సెట్టిపేట: విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలని మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య ఆకాంక్షించారు. మండలకేంద్రంలోని మోడల్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తోందన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలన్నారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు పలువురిని అలరించాయి. సామాజిక కార్యకర్త పాటిబండ్ల శ్రీరామూర్తి, ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా, దండేపల్లి హెచ్‌ఎం శోభ, సుమతమ్మ, చెట్ల రమేశ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తాంసి: ప్రజలు దోమలు వృద్ధి చెందకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని భీంపూర్ హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని అర్లి(టి) గ్రామంలో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అపరిశుభ్రంగా ఉన్న కాలనీల్లో పారిశుద్ధ్య సిబ్బందిచే క్లోరినేషన్ పనులు చేయించారు. వారి వెంట వైద్య సిబ్బంది గంగాధర్, దివ్య, కార్యదర్శి రవికాంత్, ఆశ కార్యకర్తలు సాజిద, గంగుబాయి ఉన్నారు.

వరిలో పంటకోత ప్రయోగం

భీమిని: మండల పరిధిలో ఏఈవో వినోద్‌కుమార్ పలువురు రైతులు పొలాల్లో శుక్రవారం పంట కోత ప్రయోగం చేపట్టారు. వరిలో ఎకరాకు దిగుబడి అంచనా కోసం పంట కోత ప్రయోగం చేపట్టినట్లు ఏఈవో తెలిపారు. గ్రామాలవారీగా పంటలపై ప్రయోగాలు చేసి దిగుబడిని అంచనావేసి జిల్లా స్టాటస్టిక్ అధికారులకు పంపనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఉన్నారు.

సైడ్ డ్రైయిన్‌లు లేక తిప్పలు

- రోడ్లపైకి వస్తున్న మురికినీరు
- ఇబ్బందుల్లో మండలవాసులు



సైడ్ డ్రైయినేజీలు లేని బస్టాండ్ ఏరియా

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజరు గ్రామపంచాయతీ పరిధిలో సైడ్ డ్రెయినేజీలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిర్పూర్ (టి) నియోజకవర్గ కేంద్రమైనా అభివృద్ధిలో మాత్రం ఆమడదూరంలో ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేజరు గ్రామపంచాయతీ పరిధి పూర్తిగా సిర్పూర్(టి) –కాగజ్‌నగర్, సిర్పూర్(టి) –కౌటాల ప్రధాన రహదారుల గుండా అధికంగా విస్తరించి ఉంది. ప్రధాన రహదారుల గుండా ఇరువైపులా సైడ్ డ్రెయినేజీలు లేకపోవడంతో స్థానికులతో పాటు వివిధ పనుల నిమిత్తం సిర్పూర్(టి)కి వచ్చే ప్రయాణికులు, మండలవాసులు సైతం తిప్పలు పడుతున్నారు.

ప్రధాన రహదారులపైనే మురుగు నీరు..

సిర్పూర్(టి) బస్టాండ్ ప్రాంతంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా వ్యాపార సముదాయాలు ఉన్నాయి. వ్యాపారులు వినియోగించే నీటితో పాటు మురుగునీరు సైతం సైడ్ డ్రెయినేజీలు లేకపోవడంతో ప్రధాన రహదారులపైనే పారుతుంది. వర్షాకాలంలో వర్షపు నీరు కూడా రోడ్లపైనే పారుతుండడంతో ప్రతీరోజు వ్యాపార సముదాయాలకు వచ్చే వినియోగదారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. బస్టాండ్ ప్రాంతంలో సైడ్ డ్రెయినేజీలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం శోచనీయమని మండల ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి మేజరు గ్రామపంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారుల గుండా సైడ్ డ్రెయినేజీలు, అండర్ డ్రెయినేజీలు నిర్మించి సమస్యలు పరిష్కరించాలని మండలవాసులు కోరుతున్నారు.

సైడ్ డ్రైయినేజీలు నిర్మించాలి



సిర్పూర్(టి) మేజరు గ్రామ పంచాయతీ పరిధిలో సైడ్ డ్రెయినేజీలు లేకపోవడంతో గ్రామపంచాయతీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక బస్టాండ్ ప్రాంతంలో వ్యాపారాలు నిర్వహించేవారు, పేట్‌మహెలా, డౌనల్ ప్రాంతాల్లోని కాలనీలవాసులు పడే బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. వెంటనే సైడ్ డ్రెయినేజీలు నిర్మించాలి.

– లక్ష్మణ్, సిర్పూర్(టి)

అధికారులు స్పందించాలి



సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలో సైడ్ డ్రెయినేజీలు లేకపోవడంతో గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మేజరు గ్రామపంచాయతీ పరిధిలో సైడ్ డ్రెయినేజీల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలి.

– నులిగొండ రాజశేఖర్, సిర్పూర్(టి)

సొంత పనులకు పంచాయతీ ట్రాక్టర్లు

- ప్రజాప్రతినిధులు వినియోగిస్తున్న వైనం
- కార్యాలయాల ముందు కనిపించని ట్రాక్టర్లు
- పట్టించుకోని అధికారులు



నీరు పడుతున్న జీపీ సిబ్బంది (ఫైల్)

బెజ్జూర్: గ్రామపంచాయతీల అభివృద్ధి, చెత్త సేకరణ, ప్రజాఅవసరాల కోసం ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కేటాయించిన ట్రాక్టర్లు పక్కతోవ పడుతున్నాయి. మండలంలో మొత్తం 22 గ్రామపంచాయతీలు ఉండగా, 22 ట్రాక్టర్లు, 22 ట్రాలీలు, 22 వాటర్ ట్యాంకులను ప్రభుత్వం కేటాయించింది. ప్రతినిత్యం ప్రజలకు వినియోగించాల్సిన ట్రాక్టర్లు పంచాయతీ కార్యాలయాల ముందు దర్శనమివ్వడం లేదు. ప్రజాఅవసరాల కోసం ఉన్న ట్రాక్టర్లు ప్రజాప్రతినిధుల అవసరాలకు వినియోగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సొంత పనుల కోసం వినియోగించుకోవడమే కాకుండా వాటి నుంచి వచ్చే ఆదాయాన్ని సైతం కాజేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు 'మామూలు'గా తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

దుర్వినియోగం..

గ్రామపంచాయతీలకు ప్రభుత్వం కేటాయించిన ట్రాక్టర్లను ప్రజాప్రతినిధులు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతిరోజు గ్రామపంచాయతీల్లో చెత్త సేకరణ, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా తదితర పనులు చేపట్టాల్సి ఉంటుంది. అయితే గ్రామపంచాయతీల ముందు ఉండాల్సిన ట్రాక్టర్లను కొంత మంది సర్పంచులు అద్దెకు ఇస్తూ వచ్చిన డబ్బులు వాడుకుంటుండగా, మరికొంత మంది సర్పంచులు ట్రాక్టర్లను సొంత పనులకు వినియోగిస్తూ దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. గ్రామపంచాయతీల్లో జరుగుతున్న అక్రమాలపై ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఆయా గ్రామపంచాయతీల సర్పంచులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.

మొరాయిస్తున్న ట్రాక్టర్లు..

గ్రామపంచాయతీ ట్రాక్టర్ల పరిస్థితి మూన్నాళ్ల ముచ్చటగా మారింది. చట్ట విరుద్ధమని తెలిసినా కూడా దుక్కులు దున్నేందుకు సైతం ఆ ట్రాక్టర్లను ఉపయోగిస్తున్నారు. దీంతో మూడేళ్లకే అవి మొరాయించి మూలన పడుతున్నాయి. కొన్ని ట్రాక్టర్లకు బ్యాటరీలు లేకపోగా, మరికొన్నింటి టైర్లు అరిగిపోయి పనికిరాకుండా పోయాయి. ప్రజా అవసరాలు తీర్చే ట్రాక్టర్లు పంచాయతీల ముందు కాకుండా ప్రజాప్రతినిధుల ఇళ్ల ముందు కనిపిస్తున్నాయి.

సొంత పనుల కోసం..



గ్రామపంచాయతీ ట్రాక్టర్లను ప్రజా అవసరాల కోసం మాత్రమే వినియోగించాలి. ప్రజాప్రతినిధులు తమ సొంత పనుల కోసం వాటిని వినియోగిస్తుండడంతో కొంత కాలానికే మొరాయిస్తున్నాయి. దీంతో గ్రామపంచాయతీల్లో చెత్త సేకరణ, తదితర పనులకు ఆటంకాలు ఎదురవుతున్నాయి.

– సీహెచ్ కృష్ణ, సిద్దాపూర్

గ్రామపంచాయతీ వద్దనే ట్రాక్టర్లు నిలపాలి



ప్రభుత్వం గ్రామపంచాయతీల అభివృద్ధి కోసం కేటాయించిన ట్రాక్టర్లు కార్యాలయాల ఎదుట కనిపించడం లేదు. ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద దర్శనమిస్తున్నాయి. వాటిని సొంత పనులకు వాడుకుంటున్నారు. దీంతో గ్రామపంచాయతీలో అభివృద్ధి కుంటుపడుతోంది.

– టి.బ్రహ్మయ్య, సిద్దాపూర్

తెరుచుకున్న బెల్ట్‌షాపులు

ఇచ్చోడ: బెల్ట్‌షాపుల దందా మళ్లీ మొదలైంది. ఇటీవల ఎన్నికల కోడ్ ఉండడంతో పోలీసులు బెల్ట్ దుకాణాలపై దాడులు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కొన్నిచోట్ల బెల్ట్ నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. బెల్ట్ షాపులు మూత పడడంతో ప్రజలు సంతోషించారు. కానీ ఎన్నికలు ముగిసిన తరువాత మళ్లీ బెల్ట్‌షాపుల దందా మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కన్న ముందే గ్రామాల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మండల వ్యాప్తంగా దాదాపు 150 బెల్ట్‌షాపులు ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోక ముందే బెల్ట్ దుకాణాలు తెరుచుకోవడంపై మహిళలు, కాలనీవాసుల నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయంపై ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ రాజమౌళిని వివరణ కోరగా.. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు.